# దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ సత్యప్రసాద్
- వైద్యాధికారులతో సమావేశం



కలెక్టర్, ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

జగిత్యాల, మే 31: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి బహుళ సభ్యుల అధికారిక సమావేశం (పీసీ అండ్‌పీఎన్‌డీటీ యాక్ట్ 1994) నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు గర్భం దాల్చిన మహిళల ఇంటికి వెళ్లి పరీక్షల కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. స్కానింగ్ సెంటర్‌లో గర్భిణులకు స్కానింగ్ చేసినప్పుడు విధిగా ఫారం-ఎఫ్‌ను నింపి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో దరఖాస్తు చేసుకున్న మూడు నూతన స్కానింగ్ రిజిస్ట్రేషన్ సెంటర్లు, 10 రెన్యువల్ సెంటర్లకు అనుమతి ఇచ్చే విషయమై కలెక్టర్‌కు నివేదించారు. మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం అమలవుతున్న నియమ నిబంధనలను కమిటీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్‌కుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ సుధీర్, హెల్త్ ఎడ్యుకేటర్లు కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణాధికారి రాజేశం, ఆరోగ్య పర్యవేక్షకుడు శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

మెట్‌పల్లి, మే 31: లోక్ అదాలత్‌తోనే సత్వర, సమన్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు అన్నారు. మెట్‌పల్లిలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కో-ఆర్డినేషన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడానికి పోలీసులు, న్యాయవాదులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తొగిటి రాజశేఖర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్‌గౌడ్, లోక్ అదాలత్ సభ్యుడు జేడీ సుధాకర్, న్యాయవాదులు వెంకటస్వామి, శ్రీనివాస్, గోపి, మెట్‌పల్లి, కోరుట్ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఎస్పీకి సత్కారం

మల్యాల, మే 31: కొండగట్టులో నిర్వహించిన హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాల్లో పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక బందోబస్తు చేపట్టి, విజయవంతంగా పూర్తయ్యేలా కృషి చేసిన ఎస్పీ అశోక్‌కుమార్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ సముదాయంలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు కలిశారు. ఎస్పీ అశోక్‌కుమార్‌ను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించడంతో పాటు లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆయన వెంట ఆలయ పర్యవేక్షకుడు సునీల్‌కుమార్‌గౌడ్, తదితరులున్నారు.

## తహసీల్దార్‌కు సత్కారం

మల్లాపూర్, మే 31: మల్లాపూర్ తహసీల్దార్‌గా గుగ్గిళ్ల రమేశ్‌గౌడ్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఆయనను శుక్రవారం గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రామాగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు రామాగౌడ్, మండలాధ్యక్షుడు బండి లింగస్వామిగౌడ్, నాయకులు రామాగౌడ్, ముద్దం సత్యనారాయణ, ముద్దం శరత్, ఆనంద్, కార్తీక్, రమేశ్, అర్జున్, గంగాధర్, హన్మాంత్, రాజాగౌడ్, రాజేశ్ పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన

జగిత్యాల, మే 31: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం భరోసా కేంద్రం, షీటీం సభ్యులు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఎస్ఐ రవీందర్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ అనూష, రిసోర్స్ పర్సన్లు సుజాత, సౌజన్య పాల్గొన్నారు.

# పాఠశాల బలోపేతానికి గ్రామస్తులు సహకరించాలి

వెల్గటూర్, మే 31: కుమ్మరిపల్లెలో విద్యార్థులు లేక మూతపడిన ప్రాథమిక పాఠశాలలో తిరిగి తెరిచేందుకు గ్రామస్తులు సహకరించాలని ఎంఈవో ప్రభాకర్ కోరారు. శనివారం ఆయన గ్రామంలో మాజీ సర్పంచ్ కొప్పుల విద్యాసాగర్, మాజీ ఉప సర్పంచ్ ముచ్చర్ల తిరుపతి, నాయకులతో కలిసి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యనందించేలా పటిష్టమైన చర్యలు చేపడుతామని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని ఏర్పాట్లు పాఠశాలలో చేపడుతామని తెలిపారు. గ్రామంలో అంగన్‌వాడీలో ఐదేళ్లు నిండిన చిన్నారులతో సహా సుమారు 27 మంది ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నట్లు గుర్తించామని, వీరందరిని ఇక్కడే చేర్పిస్తే ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారు. కాగా, గ్రామంలో చాటింపు వేసి, ప్రత్యేక సమావేశం నిర్వహించి, విద్యార్థులందరినీ ఇక్కడే చేర్పించేలా సహాయ సహకారాలు అందిస్తామని గ్రామస్తులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాశిగామ ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ వైద్య వెంకటేశ్వర్లు, నాయకుడు సత్యనారాయణ, యువజన, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

కోరుట్ల రూరల్, మే 31: మండలంలోని మోహన్‌రావుపేట రైతు వేదికలో శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ, లబ్ధిదారులు 45 రోజుల్లోగా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కోరుట్ల నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు. కాగా, అధికారికంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ప్రొటోకాల్ ప్రకారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఫొటో ముద్రించకపోవడంతో ఇది అధికారికంగా జరిగిందా లేదా కాంగ్రెస్ అధ్వర్యంలో జరిగిందా అనే విషయం పలువురు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో వొదెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, హౌసింగ్ అధికారులు వాసం ప్రసాద్, భాస్కర్, మినాజొద్దీన్ పాల్గొన్నారు.

## గౌడ సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

మల్లాపూర్, మే 31: గ్రామాల్లో గౌడ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రామాగౌడ్ కోరారు. మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ కులస్తుల సంక్షేమం కోసం తమ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో గౌడ కులస్తులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు రామాగౌడ్, మండలాధ్యక్షుడు బండి లింగస్వామిగౌడ్, నాయకులు పొన్నం రామాగౌడ్, ముద్దం సత్యనారాయణ, ముద్దం శరత్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్, మే 31: బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన బోడ సాగర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో భూమిని కబ్జా చేయడంతో పాటు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటికుంటను ధ్వంసం చేయగా కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఫారెస్ట్ రేంజర్ శ్రీనాథ్ తెలిపారు. సాగర్‌ను శనివారం కోర్టులో హాజరు పరుచగా, జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, మే 31: జిల్లాలోని బెస్ట్ అవెలెబుల్ పాఠశాల (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్)ల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నాన్ రెసిడెన్షియల్, 5వ తరగతి రెసిడెన్షియల్‌లో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 75, 5వ తరగతిలో 76 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఒకటో తరగతి నాన్ రెసిడెన్షియల్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల వార్షికాదాయం రూ. 1.50లక్షలలోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలలోపు ఉండాలన్నారు. సోమవారం నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. జూన్ 20న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

## ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాల రూరల్, మే 31: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు ఏపీఎం గంగాధర్ తెలిపారు. రూరల్ మండలంలో 2,770 మంది రైతుల నుంచి 1,53,200 క్వింటాళ్లు, అర్బన్ మండలంలో 653 మంది రైతుల నుంచి 43,678 క్వింటాళ్లు సేకరించినట్లు పేర్కొన్నారు. సీసీలు గంగారాం, రవీందర్, మరియా, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల/జగిత్యాల రూరల్, మే 31: మల్యాల మండలం పోతారాం, రాజారాం గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామన్నపేట విద్యుత్ ఏఈఈ ఆకునూరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్‌కో అధికారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పౌరహక్కుల దినోత్సవం

వెల్గటూర్/పెగడపల్లి/కథలాపూర్, మే 31: పెగడపల్లి మండలం ఐతుపల్లి, ఎండపల్లి మండలం గుల్లకోట, కథలాపూర్ మండలం తుర్తిలో శనివారం అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వెల్గటూర్ తహసీల్దార్ అనిల్, మండల పంచాయతీ అధికారి మహేందర్, ట్రైనీ ఎస్ఐ రవీందర్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక-జితేందర్‌రెడ్డి, ఆర్ఐ జమున, మెడికల్ సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, ఏపీఎం చంద్రకళ, ఏపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు మంజుల, అన్నమనేని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ వెల్గటూర్ మండలాధ్యక్షుడు జగన్, నాయకులు మూల రాంరెడ్డి, తడగొండ రాజు, కుమార్, సాగర్, పలుమారు అంజయ్య, మల్లేశ్, సత్యనారాయణ(గౌరి), సత్యం, నరేశ్, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వాలీబాల్ శిక్షణ తరగతులు

కథలాపూర్, మే 31: కథలాపూర్ మండలం ఊట్‌పెల్లి గ్రామంలో క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వాలీబాల్ శిక్షణ తరగతులు శనివారం రాత్రి ముగిశాయి. ఈ శిబిరంలో 36 మంది క్రీడాకారులు నెల రోజులపాటు వాలీబాల్ నేర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు బండి భాస్కర్, కోచ్ ముదాం ప్రవీణ్, క్రీడాకారులు ఏజీబీ మహేందర్, ప్రశాంత్, ప్రమోద్, నవీన్, సాగర్ పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల, మే 31: భూ భారతి గ్రామ సభల్లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల కలెక్టరేట్‌లోని ఐడీవోసీ మీటింగ్ హాల్లో శనివారం ఆయన భూ భారతి చట్టంపై జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు ఊరూరా నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో అన్ని రకాల భూసమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవోలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

- సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని దివ్యాంగుడి పోస్ట్
- కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు

సారంగాపూర్, మే 31: తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఓ దివ్యాంగుడు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసిన ఘటన బీర్‌పూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు శీర్నేని శ్రీనివాస్ ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో పేరు రాలేదని మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి వాట్సాప్ గ్రూపుల్లో ఇందిరమ్మ ఇల్లు రానందున తాను సెల్ టవర్ ఎక్కుతానని పోస్ట్ చేశాడు. వెంటనే స్పందించిన బీర్‌పూర్ ఏఎస్ఐ రవి, పోలీసులు శ్రీనివాస్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ విషయమై శ్రీనివాస్‌ను అడుగగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాల్లో పేరు రాలేదనే ఆవేదనతో ఇలా చేశానని పేర్కొన్నాడు. కాగా, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తనకు ఫోన్ చేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని, ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడవద్దని చెప్పినట్లు శ్రీనివాస్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగిత్యాల రూరల్, మే 31: బుగ్గారం మండలం వెలుగొండ గ్రామానికి చెందిన గందం రాజన్న(42) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కూరగాయలు కొని అమ్మడానికి జగిత్యాల మార్కెట్‌కు తన ఆటోలో వెళ్తున్నాడు. జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. రాజన్న చాతీపై బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు.

## నూతన కార్యవర్గం

కోరుట్ల రూరల్, మే 31: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో దిగువ రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెల్మ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బద్ధం నారాయణరెడ్డి, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## నిరుపేదకు ఆర్థిక సాయం

మేడిపల్లి, మే 31: మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన నిరుపేద పొన్నం శ్రీజ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నది. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన వంశీ శనివారం రూ. 10 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాలో ఇంటర్ తరగతులు

ధర్మపురి, మే 31: ధర్మపురి కస్తూర్బాలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్‌లో 40 సీట్లు ఉన్నాయన్నారు. పదోతరగతి పాసైన బాలికలు అర్హులన్నారు. అలాగే, ఆరో తరగతిలో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 95023 54646లో సంప్రదించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ధర్మపురి, మే 31: ధర్మపురి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అక్కనపల్లి సునీల్‌కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబసభ్యులను శనివారం విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

మేడిపల్లి, మే 31: మేడిపల్లిలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం లారీ, కారు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైనట్లు ఎస్ఐ మిట్లపెల్లి సుప్రియ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి జగిత్యాల వైపు లారీ (ఆర్‌జే 11 జీసీ 9805) వెళ్తున్నది. కాగా, ఎస్‌బీ ఏఎస్ఐగా పనిచేస్తున్న విజేందర్ రావు కారు (టీఎస్ 02 ఈఆర్ 6606) జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలో కారును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో విజేందర్‌రావుకు తీవ్రగాయాలయ్యాయి. అలాగే, కారు వెనుకబైక్‌పై వస్తున్న చెట్‌పల్లి శంకర్, చెట్‌పల్లి మోక్షిత, హన్విత‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుప్రియ పేర్కొన్నారు.

## అంగన్‌వాడీల్లో చిన్నారుల సంఖ్య పెంచాలి

పెగడపల్లి, మే 31: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి పేర్కొన్నారు. సుద్దపల్లిలో శనివారం అంగన్‌వాడీ టీచర్ల మొదటి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ, 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా టీచర్లు చూడాలన్నారు. తమ పరిధిలోని నివాసాలను సర్వే చేసి, అంగన్‌వాడీ చిన్నారులను గుర్తించి, కేంద్రాల్లో చేర్చుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, పోషకాహారంపై ప్రచారం కల్పిస్తూ, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను చేర్పించాలని స్పష్టం చేశారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, మే 31: ధర్మపురి మండలం రాయపట్నం గ్రామానికి చెందిన గొడిసెల సత్తయ్య (44) అప్పుల బాధతో శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్తయ్యకు కాలు విరగడంతో పాటు మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల పక్షవాతానికి గురయ్యాడు. చికిత్స కోసం లక్షల్లో అప్పులు చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ కోలుకోలేదు. అప్పులు తిరిగి చెల్లించే స్థోమతలేక మనస్తాపానికి గురైన సత్తయ్య ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తయ్య భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నిత్యావసర సరుకులు అందజేత

సారంగాపూర్, మే 31: మండలంలోని లచ్చక్కపేట గ్రామానికి చెందిన ఆకుల రమేశ్ గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి శనివారం యూఏఈ తెలుగు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ. 10 వేల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూఏఈ తెలుగు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు బొడ్డుపెల్లి రాము, సభ్యులు గంగాధర్, మల్లేశ్, వేణు, శ్రీను, రాజేశ్, రాజు, రమేశ్, గంగన్న, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## 1.28 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

పెగడపల్లి, మే 31: పెగడపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 9 కేంద్రాల ద్వారా 2037 మంది రైతుల నుంచి 1.28 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు, కార్యదర్శి తడ్కమడ్ల గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారంతో సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని చెప్పారు. ధాన్యంకు సంబంధించి రైతుల ఖాతాల్లో దాదాపు రూ.30 కోట్లు ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు.

## అహల్యా బాయి హోల్కర్‌కు నివాళి

జగిత్యాల, మే 31: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో లోకమాత దేవీ అహల్యా బాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి సామాజిక సమరత వేదిక నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరత వేదిక నాయకులు చిట్ల గంగాధర్, ఏసీఎస్ రాజు, బొందుకూరి శ్రీనివాస్, పుప్పాల సత్యనారాయణ, సింగం గంగాధర, అనపురం శ్రీధర్, నారేందుల శ్రీనివాస్, దొండపాటి జనార్దన్ రెడ్డి, బండి సత్యనారాయణ, రామచంద్రం, కొత్తకుండ బాలయ్య, ఎడమల వెంకట్ రెడ్డి, మామిడాల రాములు, బ్రహ్మంపెల్లి రాజేందర్, మాజీ కౌన్సిలర్ బండారి మల్లికార్జున్, గొల్లపెల్లి సత్యనారాయణ గౌడ్, పర్తి రవి, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై దృష్టిసారించాలి

మేడిపల్లి, మే 31: రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టిసారించాలని శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌నాయక్, సాధ్వీ రైతులకు సూచించారు. భీమారం మండలం లింగంపేట గ్రామంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవసరం మేరకే రసాయన ఎరువులు వాడాలని సూచించారు. మేలైన విత్తనాల ఎంపిక, రసాయన ఎరువుల వాడకం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మిట్టపెల్లి రాజిరెడ్డి, ఏఈవో సురేందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌నాయక్

## ధూమపానం చేయవద్దు

జగిత్యాల/జగిత్యాల అర్బన్, మే 31: ధూమపానం చేస్తే అనారోగ్యం బారిన పడుతారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ నుంచి ఐఎంఏ హాల్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ, సిగరెట్, గుట్కా, బీడీల్లో నికోటిన్ అనే విషపదార్థాలు ఉంటాయని, అవి ఊపిరితిత్తుల క్యాన్సర్, హార్ట్ అటాక్, హార్ట్ స్ట్రోక్, నోటి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్సీడీ డాక్టర్ అర్చన, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కోటగిరి సుధీర్, ఏఎంవో సత్యనారాయణ, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రీధర్, రాజేశం, ఎన్సీడీ కోఆర్డినేటర్లు మురళీధర్, శ్యామ్, హెల్త్ ఎడ్యుకేటర్ కటుకం భూమేశ్వర్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో మున్సిపల్, కరీంనగర్‌లోని మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, పొగాకు వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ స్పందన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ దవాఖాన వైద్యులు నాగరాజు, తాహా, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, సాయితేజ, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, మే 31: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయంలో భక్తుల రద్దీని ఈవో శ్రీకాంతరావు గమనిస్తూ క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. వివిధ సేవల టికెట్ల రూపంలో ఆలయానికి రూ. 8 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సర్దుబాటు ఉత్తర్వులతో పాఠశాలలు నిర్వీర్యం

జగిత్యాల, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆదేశిస్తూనే, ప్రస్తుతం ఉన్న సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ విమర్శించారు. జగిత్యాలలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు కోసం సమిష్టిగా కృషి చేద్దామని చెప్పిన విద్యాశాఖ అధికారులు ఏకపక్షంగా సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.? జూలై 31 వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆగస్టు ఒకటి తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు.

## చెరువు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కథలాపూర్, మే 31: కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామ శివారులోని చెరువును కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వినోద్‌కు గ్రామస్తులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. కబ్జాకు గురైన చెరువు భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, నాయకులు కోలి నరేందర్‌రెడ్డి, గంగం గంగారెడ్డి, సంబ నవీన్, గంగాధర్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

జగిత్యాల, మే 31: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసి ఉత్తములుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు బోధిస్తున్న ఉపాధ్యాయులకు 5 రోజుల నిర్వహించిన వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము నాయక్, మాజీ కౌన్సిలర్ శ్రీలత-రామ్మోహన్ రావు, కోర్సు డైరెక్టర్ బాసితక్ష, ఎస్‌వో రాజేశ్, ఎస్సార్పీ మనోహర్ చారి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అధికారులకు ప్రొటోకాల్ తెలియదా...!

కోరుట్ల రూరల్, మే 31: ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఫొటోను ఫ్లెక్సీలపై ముద్రించాలనే విషయం అధికారులకు తెలియదా అని మాజీ ఎంపీపీ తోట నారాయణ ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని మోహన్‌రావుపేట రైతు వేదికలో కలెక్టర్ సత్యప్రసాద్ చేతుల మీదుగా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఫొటో ముద్రించకపోవడం సరికాదన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్ల రూరల్, మే 31: గ్రామస్తులు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది కోరారు. గ్రామంలో శనివారం వారు ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో పాత డబ్బాలు, కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరీ, వైద్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

వెల్గటూర్/కొడిమ్యాల, మే 31: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కామల్ల మహేశ్, ఎస్ఐ ఉమాసాగర్ హెచ్చరించారు. మండలంలోని రాజారాంపల్లి, గుల్లకోట గ్రామాల్లో శనివారం విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రికార్డులు, విత్తన బిల్లులు పరిశీలించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు అడిగి తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఏఈవోలు ఉన్నారు. అలాగే, కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు నల్లగొండ, హిమ్మత్‌రావుపేట, తిప్పాయిపల్లి గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి పర్లపల్లి జ్యోతి తనిఖీలు చేపట్టారు. ఆయా దుకాణాల్లో స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు.

## రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు

కోరుట్ల, మే 31: పట్టణంలోని పలు రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, దాబాల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ ఆదేశాలతో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, దాబాల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, గడువు తీరిన తినుబండారాల ప్యాకెట్లు, నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తినుబండారాలు విక్రయిస్తున్న షాపుల యజమానులకు రూ. 10,500 జరిమానా విధించారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, బాలె అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీరు మహేశ్, మున్సిపల్ సిబ్బంది హేమంత్, జవాన్లు రమేశ్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల నియామకం

కోరుట్ల, మే 31: పట్టణంలోని సాయిరామ ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను శనివారం నియమించారు. ఈసందర్భంగా దేవాదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కాగా, సాయిరామ ఆలయంలో నూతన కమిటీ సభ్యులకు ఉత్తర్వు కాపీలను అధికారులు అందజేశారు. అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన బాలె నర్సయ్య, గడ్డం కిరణ్, నేమూరి భూమయ్య, పెంట అరవింద్, అల్లె సదాశివ్, నిమ్మల శ్రీనివాస్, రాచకొండ దేవరాజం, కోటగిరి నాగభూషణం, చిలివేరి విద్యాసాగర్‌ను ఆలయ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మలను తొలగించిన పోలీసులు

కోరుట్ల/కోరుట్ల రూరల్, మే 31: కోరుట్ల నుంచి మాదాపూర్ వెళ్లే రహదారిపై అర్ధరాత్రి వీచిన ఈదురుగాలులకు విరిగిపడ్డ చెట్ల కొమ్మలను పోలీసులు శనివారం తొలగించారు. రహదారిపై పడిన చెట్లకొమ్మలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగడంతో స్పందించిన పోలీసులు ట్రాక్టర్‌తో తొలగించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు రాజేశ్వర్, గంగాధర్, విజయ్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మారుతీనగర్, మే 31: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఎలాల అంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైద్య ఆరోగ్యశాఖతో పాటు వివిధ శాఖల అధికారులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టే ముందస్తు చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

CHANGE OF NAME

★Narala Kalpana, W/o. Narala Kartheek, H.No. 4-1-30, Uppugadda street, Vemulawada Town & Mandal, Rajanna Sircilla Dist. My Name was changed to Poorella Kalpana D/o. Poorella Ravinder
NTK-330324

CHANGE OF NAME

I, MADURI KALPANA (Old Name) D/o.BHAGAVAN, R/o. H.No. 21-2-82/3/F/1/2, Markandeya Colony, Godavarikhani, Ramagundam Mandal,Peddapalli dist, After marriage my Name was changed to KOTHA LAVANYA (New Name) W/o. KOTHA RAJNIKANTH, for all purpose.

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189